విద్యార్థులకు బహుమతులు అందజేత

బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రాజు

బీబీపేట్, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బీబీపేట కాంప్లెంక్స్ పరిధిలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కృత్యమేళా, ప్రజ్ఞోత్సవం నిర్వహించారు. పాఠశాల సముదాయంలోని 19 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, స్పెల్‌బీ రీడింగ్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో రాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ వేణుగోపాల్‌శర్మ, డిస్ట్రిక్ట్ అధికారి సిద్దిరామిరెడ్డి, ఎంఈవో అశోక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది సకాలంలో రావాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 22 : ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని ఎన్నికల సామగ్రిని తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు సకాలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రి తీసుకొని ఒక్కసారి సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలకు ఏర్పాట్లు చేయాలి

రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో ప్రభుత్వ పరంగా చేపట్టే సౌకర్యాలు, ముందస్తు ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ సింధూశర్మతో కలిసి సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా తాగునీటి, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా, వీధిలైట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. జిల్లాలోని మసీదుల వద్ద శాంతి భద్రతలను పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తున్నదని అన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దేవేందర్, పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాష్

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బుడ్మి గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో సత్యనారాయణరెడ్డి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 22 : అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీవో సత్యనారాయణరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, రాజుకు సూచించారు. మండలంలోని తాడ్కోల్, బుడ్మి గ్రామాల్లోని నర్సరీలు, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను శనివారం పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీళ్లు పట్టించాలని సూచించారు. వైకుంఠధామాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. కారోబార్ హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

'వరల్డ్ థింకింగ్ డే'

ఘన్‌పూర్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 22 : మండలంలోని ఘన్‌పూర్, సోమార్‌పేట జడ్పీహెచ్ఎస్‌లో స్కౌట్ ఉద్యమ నిర్మాత లార్డ్ బాడెన్ పావల్ జన్మదినం సందర్భంగా పాఠశాలల్లో వరల్డ్ థింకింగ్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ నేడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి విద్యార్థుల్లో సామాజిక సేవా ధృక్పథం, క్రమశిక్షణ అలవరుచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఉపయోగపడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, శారద స్కౌట్ మాస్టర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదుతో ఓట్లు తొలగించారు

తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు బాలు

మాట్లాడుతున్న తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు బాలు

కామారెడ్డి, ఫిబ్రవరి 22: ఒక ఉపాధ్యాయ సంఘం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా నుంచి ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయుల పేర్లను తొలగించారని తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు బాలు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ ఎలక్ట్రోలర్ అధికారికి ఉద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేయడంతో 350 మంది ఓటు హక్కును కోల్పోయారని తెలిపారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును కోల్పోయారని పేర్కొన్నారు. తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై విచారణ చేపట్టాలన్నారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదని దీనిపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

భిక్కనూరు, ఫిబ్రవరి 22 : అంతర్జాతీయ ఇంద్రజాల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను కంచర్ల గ్రామానికి చెందిన ఇంద్రజాలికుడు సంతోష్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, విండో చైర్మన్ రాజా గౌడ్, అశోక్, హెడ్‌మాస్టర్ మమత, ప్రసూన, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఈవో రాజు

భిక్కనూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను డీఈవో రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల సృజనాత్మకతను వెలికి తీస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసూనదేవి, ఏఈవో రాజగంగారెడ్డి, ఎంఎస్‌వో శ్రీనాథ్, ఎంవో వేణుశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

బాన్సువాడ, ఫిబ్రవరి 22 : పట్టణానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. పట్టణంలోని 8 వార్డుకు చెందిన నక్క సందీప్‌కుమార్(33) హైదరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మల్కాజిగిరి పరిసర ప్రాంతంలో నివాసముంటున్న సందీప్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సందీప్ మృతదేహాన్ని స్వగ్రామమైన బాన్సువాడకు తరలించారు, శనివారం సాయంత్రం అంత్యక్రియలు చేసినట్లు స్థానికులు తెలిపారు. యువకుడి మృతితో పాత బాన్సువాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాలకవర్గ సభ్యుల ఎన్నిక

సమాఖ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

బీబీపేట్, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్ట్ అధికారి సురేశ్‌కుమార్ హాజరయ్యారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా స్రవంతి, కార్యదర్శిగా దివ్య, కోశాధికారిగా లతను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ ఆఫీసర్ దోమకొండ ఏపీఎం రాజు, బీబీపేట ఏపీఎం బాలపోచయ్య, రాంచంద్రాగౌడ్, సీసీలు శ్రీనివాస్, బాల్‌చంద్రం, రాజేశ్వర్‌రెడ్డి, నవీన్, రాజేందర్‌గౌడ్, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

కాలిపోతున్న సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్

కామారెడ్డి, ఫిబ్రవరి 22 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామ శివారులో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కెపాసిటర్ సెల్స్ పేలడంతో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దీనిపై ఎస్ఈ శ్రవణ్ కుమార్‌ను వివరణ కోరగా కెపాసిటర్ సెల్స్ పేలడంతో చిన్నగా మంటలు చెలరేగాయని, ఎలాంటి ప్రమాదం జరగలేదని అన్నారు. సిబ్బందిని పిలిపించి మరమ్మతులు చేయించామని అన్నారు.

రేపు లచ్చాపేటలో ఇసుక వేలం

మాచారెడ్డి, ఫిబ్రవరి 22 : మండలంలోని లచ్చాపేట గ్రామంలో సోమవారం ఇసుక వేలం నిర్వహించనున్నట్లు మాచారెడ్డి తహసీల్దార్ శ్వేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులోని పెద్దవాగు వద్ద ఈ నెల 21న ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.10 వేలు చెల్లించాలని సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

- రూ.6లక్షల నగదు, తులం బంగారం, కేజీ వెండి బుగ్గిపాలు
- రూ.8 లక్షల ఆస్తినష్టం

కాలిబూడిదైన నగదు, బంగారం, వెండి వస్తువులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 22: షార్ట్‌సర్క్యూట్‌తో నివాసపు గుడిసెకు నిప్పు అంటుకొని వృద్ధుల కుటుంబం సర్వస్వం కోల్పోయిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఘటనా స్థలాన్ని ఎస్సై మల్లారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్ సందర్శించారు. కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుని, పంచనామా నిర్వహించారు. అనంతరం డీటీ చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల మణెమ్మ భర్త కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తన చెల్లెలు పద్మతో కలిసి తన నివాసపు గుడిసెలో నివసిస్తున్నది. శనివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి అకస్మాత్తుగా మంటలు రేగడంతో ఇరువురు బయటికి వచ్చి గట్టిగా అరిచారు. చుట్టు పక్కల వారు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేలోపు పూర్తిగా కాలిబూడిదైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిన ఇంట్లో ఉన్న సిలిండర్ సైతం పేలిపోయింది. ప్రమాదంలో రెండు రోజుల క్రితం పొలం అమ్మగా వచ్చిన రూ.6 లక్షల నగదు, తులం బంగారం, కేజీ వెండి, బట్టలు, నిత్యావసర వస్తువులు, గ్రాసం పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో రూ.8లక్షల ఆస్తినష్టం జరిగింది. నష్టం వివరాలను తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందిస్తామని డీటీ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★Wanted Helper for Cloth Showroom in Hyderabad. Food and Staying Facility is available. Call: 9000321282, 9849409986.
NT-09041

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కమ్మర్‌పల్లిలో ఉచిత చికెన్, ఎగ్ మేళా

మోర్తాడ్, ఫిబ్రవరి 22: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చికెన్, ఎగ్ మేళా కార్యక్రమాన్ని వెన్‌కాబ్ కంపనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు ఉచితంగా ఎగ్ మరియు చికెన్ ఫ్రైని సరాఫరాచేశారు. ఈసందర్భంగా కంపనీ వారు మాట్లాడుతూ..చికెన్, ఎగ్ తినే విషయంలో భయాన్ని వీడాలని చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెన్‌కాబ్ కంపనీ వారు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న గాంధారి వాగు

- వాగులో పారేస్తున్న చికెన్ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు
- కలుషిత నీరుతాగి రోగాల బారిన పడుతున్న పశువులు

గాంధారి, పిబ్రవరి 21: ఉత్తరం వైపు నుంచి దక్షణానికి ప్రవహించే గాంధారి వాగులో స్నానం చేస్తే గంగలో చేసినట్లుగా భావించే వారు. అలాంటి వాగు ప్రస్తుతం కలుషితమై కంపుకొడుతున్నది. కొన్నేండ్ల క్రితం వరకు గాంధారి వాగులో స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తుండేది. గ్రామస్తులు బట్టలు ఉతికి, స్నానాలు చేసేవారు. పశువులకు నీరు తాగించే వారు. మత్స్యకారులు చేపలు పట్టేవారు. వేసవి వచ్చిందంటే గ్రామంలోని యువకులు ఈత కొట్టడానికి వచ్చే వారు. బతుకమ్మ, వినాయక, దుర్గ మాతా విగ్రహాలు నిమజ్జనం చేసేవారు. అలాంటి స్వచ్ఛమైన వాగు ప్రస్తుతం మురికి నీరు, చెత్తా చెదారంతో నిండి కంపుకొడుతున్నది.

మురికి కాలువలు వాగులో కలపడంతో ..

గ్రామంలోని మురికి కాలువల నుంచి వచ్చే మురుగు నీరు వాగులో కలుస్తుండడంతో వాగులోని నీరు మొత్తం ఆకుపచ్చ రంగులోకి మారిపోయింది. కొందరు వ్యక్తులు చెత్తచెదారంతోపాటు ప్లాస్టిక్ కవర్లు, చికెన్ వ్యర్థాలు పడేస్తుండడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. నీరు కలుషితం కావడంతో వాగులో చేపలు కానరావడం లేదు. వాగులోంచి పంట పొలాలకు వెళ్లే రైతులకు చర్మ వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

రోగాల బారిన పడుతున్న పశువులు..

గ్రామంలోని వంతెన సమీపంతో పాటు, బామన్‌రేవు, పోచమ్మరేవు ప్రాంతాల్లోని మురికి కాలువలు వాగులో కలుస్తున్నాయి. దీంతో వాగులోని నీరు దేనికీ పనికి రాకుండా కలుషితమైంది. అందులోని నీరు పశువులు తాగి రోగాల బారిన పడి చనిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి నీటిలో చేపలు పెరగకపోవడంతో మత్స్యకారులు సైతం ఉపాధి కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఆయా పార్టీల నాయకులు స్పందించి వాగులో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాగులో మురికి కాలువలు కలవడంతో కలుషితమైన నీరు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కెప్టెన్లుగా పేట్ సంగెం విద్యార్థులు

బుక్య అర్జున్

బానోత్ ఉషా

గాంధారి, ఫిబ్రవరి 22: వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లకు కెప్టెన్లుగా, మండలంలోని పేట్ సంగెం పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ రాథోడ్ శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా బాలుర జట్టు కెప్టెన్‌గా బుక్య అర్జున్, బాలికల జట్టు కెప్టెన్‌గా బానోత్ ఉషా ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పిట్లం పాఠశాల విద్యార్థులు...

పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పెద్దకొడప్‌గల్,(పిట్లం) ఫిబ్రవరి 22 : వికారాబాద్‌లో ఆదివారం నిర్వహించే రాష్ట్రస్థాయి 34వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పిట్లం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షర, ప్రియాంక, గణేశ్ పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంజీవులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దేవీసింగ్, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వారిని అభినందించారు.

సమస్యలుంటే వార్డు ఆఫీసర్లను సంప్రదించాలి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: పట్టణంలోని వార్డుల్లో ఏవైనా సమస్యలుంటే సంబంధిత వార్డు ఆఫీసర్లను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో వార్డులను పట్టించుకునే వారు లేకుండా పోయారని, పాలన అస్తవ్యస్తంగా మారిందని ఎవ్వరూ అనుకోవద్దని, ఎటువంటి సమస్యలు ఉన్నా వార్డుల వారీగా నియమించిన వార్డు ఆఫీసర్లు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. సానిటేషన్, నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు సమస్య ఏదైనా వార్డు ఆఫీసర్లను సంప్రదించాలని, వారు వెంటనే సమస్యను పరిష్కరిస్తారన్నారు. 1వ వార్డుకు వార్డు ఆఫీసర్‌గా సూర్యవర్ధన్, సెల్ నెంబర్ : (9492255376), రెండోవార్డు కాశీరాములు - (9948015778), మూడోవార్డు శేఖర్ - (9494719679), నాల్గో వార్డు మహేందర్ - (9177616962), ఐదోవార్డు జ్యోతి - (7036263658), ఆరో వార్డు శ్రీకాంత్ - (8179853653), 7వవార్డు సుజాత - (9346672049), 8వవార్డు గంగాధర్ - (9000113284), 9వవార్డు అంజయ్య - (9492253911), 10వవార్డు సంతోష్‌రెడ్డి - (7207202313), 11వవార్డు గంగారాం - (9010137850), 12వవార్డు స్వామి - (9912334846)ను సంప్రదించాలని సూచించారు. వార్డు ఆఫీసర్లనుంచి సరైన స్పందన రాలేని పరిస్థితిలో మున్సిపల్ కమిషనర్ నంబర్ 7815847476 కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఆలయానికి సీసీ కెమెరాల వితరణ

అల్లూరమ్మ ఆలయానికి సీసీ కెమెరాలు అందిస్తున్న దాత మంగళి విఠల్

లింగంపేట, ఫిబ్రవరి 22: మండలంలోని కేశాయిపేట గ్రామ శివారులోని అల్లూరమ్మ ఆలయానికి సీసీ కెమెరాలను దాతలు అందించారు. మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన మంగళి విఠల్, నాగమణి, అరవింద్ శనివారం సీసీ కెమెరాలు అందించారు. ఇటీవల అల్లూరమ్మ ఆలయంలో పలుమార్లు చోరీలు జరిగినందున సీసీ కెమెరాలు అందించినట్లు దాతలు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం విక్రయాలకు సెలవు

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో..
- 48 గంటల పాటు మూసి ఉండనున్న వైన్స్‌లు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ 48 గంటల పాటు మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లో వైన్సులు మూసివేయాలని ఈ నెల 20న ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు వైన్సుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25 సాయంత్రం 4 గంటల నుంచి 27న సాయంత్రం 4 గంటల వరకు మూసి ఉంచాలని సూచించారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 22: ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షను ప్రభుత్వం ఈ నెల 23న నేడు (ఆదివారం)నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి సాం ఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సం క్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడుతూ..5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9గంటలలోపు రావాలని, తమతో పాటు హాల్‌టికెట్, పరీక్షప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నులు తీసుకొని రావాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులు ఉంటే తాము చదువుతున్న పాఠశాల నుంచి బోనాఫైడ్ లేదా ఆధార్‌కార్డును వెంటతెచ్చుకొని ఇన్విజిలేటర్లకు చూయించాలని పేర్కొన్నారు.

నాలుగు విడుతల్లో గృహాల బిల్లులు విడుదల

ఎల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ డీఈఈ సుభాష్

లింగంపేట, ఫిబ్రవరి22: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల బిల్లులు నాలుగు విడుతల్లో అందించనున్నట్లు గృహనిర్మాణ శాఖ డీఈఈ సుభాష్ తెలిపారు. మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన ఎల్లారంలో శనివారం ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు గృహనిర్మాణ పనులు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. పాత బెస్మెంట్లకు డబ్బులు రావన్నారు. గృహ నిర్మాణ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులకు బెస్మెంట్ పూర్తయ్యాక రూ. లక్ష , గోడల నిర్మాణం తర్వాత రూ. లక్ష , స్లాబ్ అనంతరం రూ.రెండు లక్షలు, గృహ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. లక్ష చొప్పున డబ్బులు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరేశ్, గ్రామ కార్యదర్శి, గృహ నిర్మాణ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.